గాజువాక సమగ్రాభివృద్ధికి కృషి


బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు


68వ వార్డులో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: గాజువాక సమగ్రాభివృద్ధికి అధిక నిధులను కేటాయించామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. తమ కృషితో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా అధిక నిధులు అందుతున్నాయన్నారు. పాతగాజువాక జంక్షన్‌లో రూ.37.90 లక్షలతో చేపట్టనున్న బస్ షెల్టర్ నిర్మాణానికి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాజువాక ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. మౌలిక వసతుల ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ లక్షలాది రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. గాజువాక అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, డీసీఎంఎస్ చైర్ పర్సన్ పల్లా చినతల్లి, 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు మహ్మద్ రఫీ, ఫరీదుల శ్రీను, అప్పారి విష్ణుమూర్తి, జి.ఆనంద్, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

68వ వార్డులో 53.5 లక్షల పనులకు శ్రీకారం

అక్కిరెడ్డిపాలెం: విశాఖను ప్రపంచంలోనే ప్రత్యేక స్థానంలో నిలబెట్టగల నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే అని మేయర్ హరివెంకట కుమారి అన్నారు. 68వ వార్డులో రూ.53.5 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాగిరెడ్డితో కలిసి, ఆమె శంకుస్థాపన చేశారు. బీహెచ్‌పీవీ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయం కింద ఉన్న డ్రైనేజీపై పలకలకు రూ.19 లక్షలు, ప్రసన్నగిరిపై తలపెట్టిన రోడ్డు నిర్మాణ పనులకు రూ.19.50 లక్షలు, అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక వద్ద డ్రైనేజీల నిర్మాణానికి రూ.15 లక్షల ఎంపీ ల్యాడ్స్‌తో చేపట్టనున్న పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్‌ను, ఎమ్మెల్యేను ఆలయ పాలకమండలి సభ్యులు ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి, సన్మానించారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో 90 శాతం పనులను చేపట్టి, పూర్తి చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా నెరవేరని అనేక పనులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించానని చెప్పారు. రానున్న కాలంలో మిగిలి పోయిన పనులను పూర్తి చేసి, గాజువాకను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలబెడతానన్నారు. కార్పొరేటర్ గుడివాడ అనూష ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ వార్డు అధ్యక్షుడు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, నేలపాటి సత్యవతి, మానిటరింగ్ కమిటీ మెంబర్ బోనెల జోసెఫ్, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర, ఈటి శ్యామలరావు, నగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, నంబారు రాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

మోడ్రన్ బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన

కూర్మన్నపాలెం: 86వ వార్డు కూర్మన్నపాలెంలో సుమారు 38 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న మోడరన్ బస్ షెల్టర్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఏఈ తులసి, కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాం, మాటూరి శ్రీనివాసరావు, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు వినతి


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను పెదగంట్యాడ జంక్షన్‌లో ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. జేసీని కలిసిన వారిలో బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి, టేకేటి శ్రీను, గొందేశి వెంకటరమణారెడ్డి ఉన్నారు.

రస్తా నిర్మాణంపై జేసీకి విన్నపం

అక్కిరెడ్డిపాలెం: 69వ వార్డు షీలానగర్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం జరిగే ప్రాంతంలో నాతయ్యపాలెం నుంచి షీలానగర్‌ను కలుపుతూ జాతీయ రహదారి వరకు కొనసాగనున్న రస్తా నిర్మాణానికి సహకరించాలని జేసీ విశ్వనాథన్‌ను ఎమ్మెల్యే నాగిరెడ్డి కోరారు. వార్డు నాయకులతో కలిసి జేసీని కలిసిన ఆయన వినతిపత్రం సమర్పించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, నాయకులు బోగాది అప్పారావు, కనిమిరెడ్డి శ్రీను, బయన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డాక్టర్ రాజారావు

పెదగంట్యాడ: నెల్లూరు జిల్లా కావలిలో ఈ నెల 21న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి మిస్టర్ సింహపురి స్టీల్ మెన్ బాడీబిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలకు విశాఖ జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశామని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాజారావు తెలిపారు. సత్య హెల్త్ కేర్ జిమ్ ఆవరణలో శనివారం క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ కావలిలో నిర్వహించే పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు గోవాలో నిర్వహించనున్న క్రీడా పోటీల ఎంపికలకు హాజరవుతారని చెప్పారు. అనంతరం ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఫెడరేషన్ కప్ పోటీలలో విజయం సాధించిన బాడీబిల్డర్ హేమంత్ రెడ్డిని సత్కరించారు. ప్రపంచ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విశాఖ జిల్లాకు చెందిన క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బి.కోటిరెడ్డి, టి.శివశంకర్, మిస్టర్ ఇండియా బాడీ బిల్డర్ టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు మళ్లిస్తాం

జెడ్సీ సింహాచలం


గళ్లవానిపాలెం ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన మురుగునీటిని పరిశీలిస్తున్న జెడ్సీ సింహాచలం

అగనంపూడి: గళ్లవానిపాలెంలోని అపార్ట్‌మెంట్‌లలో వాడుకనీరు నల్ల చెరువులోకి మళ్లించకుండా చర్యలు తీసుకుంటామని గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం అన్నారు. 79వ వార్డు గళ్లవానిపాలెం, పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. డ్రైనేజీలు, బహుళ అంతస్తుల ఔట్ లెట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీలు, రహదారుల నిర్మాణం, వీధి దీపాల నిర్వహణను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గళ్లవానిపాలెం పరిసర ప్రాంతంలోని నివాసాల నుంచి వస్తున్న వాడుక నీరు నల్లచెరువులోకి మళ్లిస్తుండడంతో ఈ ప్రాంతం కలుషితం అవుతుందని జెడ్సీ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన నీరు నల్లచెరువులోకి మళ్లించకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి సహకారంతో అపరిష్కృత సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కొమ్మోజు భీష్మాచారి, పోలిరెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 73వ వార్డు గొంతినవానిపాలెం సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులను కలుసుకున్నారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రెడ్డి జగన్నాథం, నాయకులు కంది పైడినాయుడు, గొరుసు సత్యం, రామకృష్ణరాజు, అలీ, సంతోష్, కిరణ్, ధనుంజయ్ తదితరులతో పాటు వలంటీర్లు, సచివాలయ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు వృథా


వుడా ఫేజ్-1లో రోడ్డు మీద వృథాగా పోతున్న తాగునీరు


వుడా ఫేజ్-2లో

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం వుడా ఫేజ్-1, 2 లో మంచినీటి పైప్‌లైన్లు పగిలి తాగునీరు వృథాగా పోతోంది. ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు రహదారిపైకి చేరడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. బురదమయమైన రోడ్లపై వాహనాలు స్కిడ్ అయి, ప్రమాదాలకు గురవుతున్నారు. నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల గ్రంథ పఠనం


విద్యార్థులతో క్యారంబోర్డు ఆడిస్తున్న గ్రంథాలయాధికారి

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో చిన్నారులతో శనివారం గ్రంథపఠనం చేయించారు. అలాగే కథలు చెప్పారు. అనంతరం క్యారం బోర్డు ఆడించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ఉక్కు జనరల్ ఆస్పత్రి సీజీఎం ప్రకాశ్

ఉక్కునగరం: ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఉక్కు స్టేడియంలోని వెల్‌నెస్ సెంటర్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ 67వ జన్మదినం సందర్భంగా విజయశ్రీ బ్లడ్ సెంటర్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) బి.కె. మొహంతి, స్టీల్‌ప్లాంట్ టి.క్యూ.ఎం విభాగం జీఎం గోవర్ధన్ రెడ్డి రక్తదానం చేశారు. శిబిరంలో 51 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు ఎమ్మెల్యే అభినందన


శ్రీనాథు వర్షిణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గాజువాక హైస్కూల్ టాపర్‌గా నిలిచిన శ్రీనాథు వర్షిణిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అభినందించారు. జీవీఎంసీ 65వ వార్డు సంజీవిగిరి కాలనీకి చెందిన ఆమె 600 మార్కులకు గాను 578 మార్కులు సాధించి సత్తా చాటింది. ఈ సందర్భంగా వర్షిణిని అభినందించిన ఎమ్మెల్యే, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మద్దాల అప్పారావు, లోకనాథనావు, నాగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

అక్కిరెడ్డిపాలెం: బిడ్డలను కంటికి రెప్పలా కాపాడే అమ్మ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ శిల్పా రెడ్డి అన్నారు. మే 14న మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల్లో వచ్చే వివిధ వ్యాధులు, నివారణ అంశాలపై చర్చించారు. గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, పీసీఓఎస్ హార్మోన్ల రుగ్మత, క్రమరహిత పీరియడ్స్, హిర్సుటిజం, స్థూలకాయం, గర్భస్రావాలు తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులను సకాలంలో గుర్తించి, సంబంధిత వైద్యుల సలహా మేరకు వైద్యం పొందాలని సూచించారు.

16న ఉక్కు అడ్మిన్ కార్యాలయం ముట్టడి


ఉక్కు మెయిన్ గేటు వద్ద ప్రచారం చేస్తున్న యువ కార్మికులు

ఉక్కునగరం: ఉక్కు పరిపాలన భవనం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉక్కు యువ కార్మికులు కోరారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాల అమలు డిమాండ్‌పై ఈ నెల 16న ఉక్కు పరిపాలన భవనం ముట్టడించాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా ముట్టడి కార్యక్రమంపై వివిధ కూడళ్లు, విభాగాల్లో బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. యువ కార్మికులు మాట్లాడుతూ సెయిల్‌తో తమ పాటు చేసిన కార్మికులు కొత్త వేతనాలు అందుకుంటుండగా, ఇక్కడ మాత్రం అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. నూతన వేతనాలు అమలు చేయకపోవడం వల్ల ప్రతీ నెలా వేలాది రూపాయలు నష్టపోతున్నామన్నారు. ముట్టడి కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గోవడం ద్వారా నూతన వేతనాలు అమలుకు సహకరించాలని కోరారు.

'ఉక్కు వైద్యుని బదిలీ ఉపసంహరించాలి'


ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతితో చర్చిస్తున్న ఓబీసీ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి దంతవైద్యుడు డాక్టర్ సంతోష్ బదిలీని నిలుపుదల చేయాలని స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్‌ను శనివారం కలిసి, వైద్యుని బదిలీ అంశంపై చర్చించారు. సుమారు లక్ష మందికి సేవలు అందించే ఉక్కు జనరల్ ఆస్పత్రిలో సీనియర్ దంత వైద్యుని అవసరం ఉండగా, డిస్పెన్సరీ వంటి జగ్గయ్యపేట మైన్స్‌కు బదిలీ చేయడం అన్యాయమన్నారు. దీనిపై విభాగాధిపతి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీనివాసరావు, నాయకులు వై.ఎల్. నాయుడు, యు. శ్రీనివాసరావు, కోయిలాడ శ్రీనివాసరావు, ఆర్.వి.నారాయణ, జి.ఆర్.కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి అన్నారు. వార్డు పరిధిలోని కేఎన్ పాలెం నుంచి పెదపాలెం వరకు రూ.97 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులతో పాటు రూ.20లక్షలతో చేపట్టిన పిట్టవానిపాలెం, మరడ దాసరిపేట, ఇస్లాంపేట బీటీ రోడ్డు మరమ్మతు పనులను శనివారం ఆమె పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు


స్వీట్లు తినిపించుకొంటున్న కాంగ్రెస్ నాయకులు

గాజువాక: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ గాజువాక నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ గాజువాక సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ రాహుల్ గాంధీ నిర్వహించిన జోడో యాత్రకు దేశ ప్రజల మద్దతు లభించిందన్నారు. ఎన్‌డీఏ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, 2024 ఎన్నికల్లో కూడా దేశంలో కాంగ్రెస్‌కు ఇదే మాదిరిగా మద్దతు పలుకుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడివాడ శ్రీను, యరబాల భూలోక, చక్రధరరావు, అప్పారావు, హరిబాబు, రామారావు, ఆనంద్, ప్రసాద్, షణ్ముఖ, షరీఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో యాపిల్ ఐ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


యాపిల్ ఐ స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు


ఎస్ఆర్ డీజీ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గాజువాక: సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన స్థానిక యాపిల్ ఐ స్కూల్ విద్యార్థులను ఆ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ టి.బలరామకృష్ణ మాట్లాడుతూ ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. పరీక్షలకు హాజరైన 54 మంది విద్యార్థుల్లో అందరూ ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. వారిలో 51 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో, ముగ్గురు విద్యార్థులు 90 శాతం పైగా మార్కులను సాధించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమీలా ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ డీజీ స్కూల్ విజయకేతనం

సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో స్థానిక ఎస్ఆర్ డీజీ స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారు. ఈ ఫలితాల్లో 500 మార్కులకు గాను వి.కలీష్ 477 మార్కులు, డి.హిమబిందు 470, అనురాగ్ కుమార్, వి.ప్రణవి 464 మార్కులు, సందీప్ కుమార్ 463 మార్కులతో ఉత్తీర్ణులు కాగా, 26 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులతో పాసయ్యారని పాఠశాల డీజీఎం మోహన్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శివ కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గౌరీ చంద్రశేఖర్ విద్యార్థులను అభినందించారు.

బీజేపీపై వ్యతిరేకతకు కర్ణాటక ఫలితాలే నిదర్శనం


దీక్షలో పాల్గొన్న నాయకులు, మహిళలు

కూర్మన్నపాలెం: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కర్ణాటక ప్రజలు తమ వ్యతిరేకతను తెలియజేశారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దక్షిణ భారతదేశంలో బీజేపీ ప్రభుత్వానికి మద్దతిస్తున్న ఏకైక రాష్ట్రమైన కర్ణాటకలో బీజేపీ తన అధికారాన్ని కోల్పోవడమే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 821వ రోజు ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ విభాగాల కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. దేశంలో మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకించడం ద్వారా ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోగలమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 75వ వార్డు సీతానగరం ఎస్సీ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతో గత పన్నెండేళ్లగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇకపై ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఈ సమస్యను స్థానికులు తన దృష్టికి తీసుకురావడంతో రూ.8లక్షలతో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ భానుప్రకాష్, మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామిని, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. పురోహిత్ అలంకారి కరిసీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

లోక్ అదాలత్‌లో 1981 కేసులు పరిష్కారం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ జడ్జి శ్రీవిద్య

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1981 కేసులు పరిష్కారం అయ్యాయి. 13వ అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ ఆధ్వర్యంలో 4 బెంచ్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం కేసులు రాజీ ద్వారా పరిష్కరించబడ్డాయి. కార్యక్రమంలో ప్రధాన సీనియర్ జడ్జి ఎస్.శ్రీవిద్య, 3వ ఎంఎంసీ ఇ.రాజేంద్రబాబు, 8వ ఏసీఎంఎం వై.శ్రీలక్ష్మి, జేసీజే ఎం.ప్రేమలత, ఏపీపీ వాణి, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.వి.స్వామి, బి.వి.ఎం.కృష్ణ, సీనియర్ న్యాయవాదులు జి.చిరంజీవి, ఎ.మురళీమోహన్, దేవి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్‌కు అభినందనల వెల్లువ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) సురేష్ చంద్ర పాండేను వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు అభినందించారు. నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శనివారం ఉక్కు పరిపాలన భవనంలో పాండేను కలిసి సత్కరించారు. లైజన్ ఆఫీసర్ వి. తిరుపతిరావు, సెల్ ఆఫీసర్ ప్రసాద్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షులు బి. తౌడన్న తదితరులు పాల్గొన్నారు. స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు నూతన డైరెక్టర్ పాండేను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్యక్రమంలో నాయకులు వై. మస్తానప్ప, కర్రి దాలినాయుడు, నల్లమల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. డీవీఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు డైరెక్టర్‌ను కలిసి శాలువా కప్పి, పూలమాలలతో అభినందించారు. డి.వి.రమణారెడ్డి, దల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.